సాక్షి ప్రకాశం

I

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



కొడుకుని కడతేర్చిన తండ్రి

మద్యానికి బానిసైన కొడుకు డబ్బుల కోసం వేధిస్తుండటంతో ఆ వేధింపులు భరించలేని తండ్రి గొడ్డలితో కుమారుడిని నరికి చంపాడు.

- IIలో..



హైకోర్టులో ఉద్యోగం పేరుతో మోసం

హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి గుంటూరుకు చెందిన కన్సల్టెన్సీ డబ్బు తీసుకుని మోసగించిందని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
37/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు

ఒంగోలు: 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్రమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటీష్ వారి పాలన నుంచి విముక్తి పొందేందుకు నిర్వహించిన జాతీయోద్యమంలో ఎందరో మహానుభావులు, త్యాగధనులు చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం మన బాధ్యతగా, స్వాతంత్య్రం కోసం పోరాడిన త్యాగధనులకు నివాళులు అర్పిస్తూ గర్వంగా త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేద్దామని పిలుపునిచ్చారు.

నేడు బాలినేని పర్యటన వివరాలు

ఒంగోలు: ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 7.30 గంటలకు మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, 8 గంటలకు రంగారాయుడు చెరువు మీద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, 8.30 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో, 9 గంటలకు సీవీఎన్ రీడింగ్ రూము పాలకమండలి ఆధ్వర్యంలో, 9.30 గంటలకు పోలీసు పరేడ్ గ్రౌండులో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 10 గంటలకు అద్దంకి బస్టాండులని మీనా మసీదు సెంటర్‌లో మసీదు కమిటీ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణతోపాటు 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నగర నాయకుడు కటారి శంకర్‌రావు ఆధ్వర్యంలో జరిగే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు 77వ స్వాతంత్య్ర సంబరాల్లో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కటారి శంకర్‌రావు పిలుపునిచ్చారు.

ఒక సర్పంచ్, 47 వార్డు సభ్యులు ఏకగ్రీవం

ఒంగోలు అర్బన్: ఖాళీలు ఏర్పడిన పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్, ఉపసంహరణ ప్రక్రియలు పూర్తయి సోమవారం ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను అదనపు జిల్లా ఎన్నికల అధికారి, డీపీవో ప్రకటించారు. అర్ధవీడు, శింగరాయకొండ సర్పంచ్ స్థానాలకు సంబంధించి అర్ధవీడు ఏకగ్రీవం కాగా సింగరాయకొండ సర్పంచ్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఒక్క స్థానానికి ఐదుగురు అభ్యర్థులు పోటీలు ఉన్నారు. అదేవిధంగా వివిధ పంచాయతీలకు సంబంధించి మొత్తం 63 వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్‌లు అందగా వాటిలో 47 వార్డులు ఏకగ్రీవం కాగా ఒక వార్డులో నామినేషన్ దాఖలు కాలేదు. దీంతో మిగిలిన 15 వార్డులకు సంబంధించి ఎన్నికల బరిలో 38 మంది అభ్యర్థులు ఉన్నారు.

భవిష్యత్ చదువులకు భరోసా

భవిష్యత్ చదువులకు భరోసా కల్పిస్తూ విద్యార్థుల్లో వినూత్నమైన ఆలోచనలను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏటా ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) పథకాన్ని నిర్వహిస్తోంది. ఈ పథకం ద్వారా ఎంపికైన విద్యార్థికి ఏడాదికి రూ.10 వేలు ఆర్థికసాయం అందిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనాలంటూ డీఈవో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం
- చదువు పూర్తయ్యేంత వరకు ఉపకార వేతనం
- ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- దరఖాస్తుకు చివరితేదీ ఈనెల 31 వరకు



ఒంగోలు:

ఇన్‌స్పైర్ పథకం భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ) ప్రధాన కార్యక్రమాల్లో ఒకటి. 10 నుంచి 15 సంవత్సరాల వయస్సులో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా 6 నుంచి 10వ తరగతి వరకు పాఠశాల విద్యార్థుల సృజనాత్మకత, వినూత్న ఆలోచనల సంస్కృతిని పెంపొందించేందుకు వీటిని అందజేస్తున్నారు. ప్రతి పాఠశాల నుంచి 5 ఉత్తమ ఒరిజినల్ ఆలోచనలు/ఆవిష్కరణలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

దశలవారీగా పథకం నిర్వహణ:



తొలుత విద్యార్థులు పాఠశాల స్థాయిలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వాటితో జిల్లా స్థాయి ప్రదర్శన, ప్రాజెక్టు పోటీలు నిర్వహిస్తారు. వాటిలో కొన్నింటిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి ఆలోచనల కోసం 10 వేల ఉత్తమ ఆలోచనలు/ఆవిష్కరణలను ఆహ్వానిస్తారు. తదుపరి జాతీయ స్థాయిలో 1000 ఉత్తమ ఆలోచనలు/ఆవిష్కరణలను ప్రదర్శించడం, జాతీయ అవార్డులు, భవిష్యత్ దిశలో టాప్ 60 ఆవిష్కరణలను ఎంపిక చేస్తారు. అనంతరం వీటిని యాన్యువల్ ఫెస్ట్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో ప్రదర్శిస్తారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్.డీఎస్‌టీ.జీవోవీ.ఇన్ అనే వెబ్ పేజీ ఓపెన్ చేసి అందులో స్కూల్ అథారిటీని క్లిక్ చేసి వన్‌టైం రిజిస్ట్రేషన్ క్లిక్ చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆన్‌లైన్ మోడ్ అని వస్తుందని, దానిని క్లిక్ చేసి న్యూ స్కూల్ రిజిస్ట్రేషన్ ఫాం వస్తుంది. అందులో మెయిల్, డైస్ నంబర్, రెవెన్యూ జిల్లా వంటి వివరాలు నమోదు చేసి సేవ్ అండ్ నెక్స్ట్ నొక్కిన తరువాత ఫార్వర్డ్ అప్రూవల్ అని జిల్లా అథారిటీకి ఫార్వర్డ్ చేయాలి. ఇలా చేసిన వెంటనే స్కూల్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ సక్సెస్‌ఫుల్ అంటూ ఒక అప్లికేషన్ ఐడీ వస్తుంది. తరువాత జెనరేట్ అక్‌నాలెడ్జిమెంట్ సేవ్ అండ్ ప్రింట్ తీసుకుని స్కూలు రికార్డులో భద్ర పరుచుకోవాలి. జిల్లా అథారిటీచే అప్రూవ్ అయిన తరువాత మెయిల్ ఐడీకి వచ్చే లింకు ద్వారా పాఠశాల యూజర్ ఐడీ, పాస్‌వర్డు క్రియేట్ చేసుకోవాలి.

మన జిల్లా నుంచి ఈ సైన్స్‌ఫెయిర్‌కు నామినేట్ అయిన ప్రాజెక్టుల వివరాలు

సంవత్సరం	ఎంపికైన ప్రాజెక్టులు	రాష్ట్రస్థాయి	జాతీయ స్థాయి
2017-18	321	32	5
2018-19	91	10	1
2019-20	353	38	5
2020-21	213	21	2
2021-22	195	20	1
2022-23	126	జరగాల్సి ఉంది	జరగాల్సి ఉంది

విద్యార్థులకు ఉపయోగకరం



ఇన్‌స్పైర్‌లో ప్రాతినిధ్యం వహించే విద్యార్థులకు భవిష్యత్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. దీనిపై జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే అవగాహన కల్పించాం.

– సుబ్బారావు, డీఈవో పీఎస్

ఎక్కువ మంది నమోదు చేసుకోవాలి



గత ఏడాది మన జిల్లా నుంచి 126 ప్రాజెక్టులు జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వీరికి ఒక్కొక్కరికి ప్రాజెక్టు రూపకల్పనకు రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది. ఈ సారి ఇన్‌స్పైర్‌లో మరింత మంది విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నాం. అందులో భాగంగా విద్యార్థులను భాగస్వాములు చేసేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని కోరుతున్నాం.

– టి.రమేష్, జిల్లా సైన్స్ అధికారి

నామినేషన్లు చేసే విధానం

లాగిన్ అయి, హైస్కూల్స్ 6 నుంచి 10వ తరగతి వరకు ఐదుగురు విద్యార్థులు, ఉన్నత పాఠశాల అయితే ముగ్గురు విద్యార్థుల పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, విద్యార్థి బ్యాంక్ అకౌంట్ నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్రాంచిపేరు తదితర వివరాలను నింపాలి. విద్యార్థుల ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని , ప్రాజెక్టు రైటప్‌ను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేసి జిల్లా అథారిటీకి నామినేషన్లను ఫార్వర్డ్ చేయాలి. గత ఏడాది వన్‌టైం రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకుని యూజర్ ఐడీ, పాస్‌వర్డు గుర్తున్నవారు నేరుగా నామినేషన్స్ చేయవచ్చు. యూజర్ ఐడీ, పాస్‌వర్డు గుర్తులేనివారు అదర్స్ అనే ఆప్షన్ ద్వారా వన్‌టైం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విజ్ఞాన శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మక్కువ పెంచేలా సృజనాత్మకమైన, నూతనత్వంతో, పర్యావరణ హితమైన, సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించేలా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా విద్యార్థులకు ప్రాజెక్టుల రూపకల్పనలో మార్గనిర్దేశం చేయాల్సి ఉంటుంది.

నవరత్నాల హామీలు వంద శాతం అమలు



5వ డివిజన్ గోపాలనగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన
- మెగా పీపుల్స్ సర్వేలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున అనుకూలత
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి

ఒంగోలు సబర్బన్: నవరత్నాల హామీలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వంద శాతం అమలు చేసినట్లు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిందన్నారు. వైఎస్సార్ సీపీ ఏప్రిల్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్తు పేరుతో మెగా పీపుల్స్ సర్వేను నిర్వహించిందన్నారు. ఈ సర్వేలో ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలు వారి భవిష్యత్తు, వారి పిల్లలు భవిష్యత్తు కోసం ఎవరిని విశ్వసిస్తున్నారన్న విషయమై అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారన్నారు. మెగా సర్వేలో వస్తున్న ఫలితాలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన మోహన్ రెడ్డి పాలనకు మద్దతుగా ప్రజలు నిలిచారని భరోసా వ్యక్తం చేశారు. మెగా సర్వేలో భాగంగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం సందర్శించామన్నారు. సీఎం జగనన్న పాలనలో అక్కడి ప్రజలకు జరిగిన మంచిని వివరించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ముందుకు వెళుతోందని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలకు ఉన్న నమ్మకం మాటల్లో చెప్పలేనిదన్నారు. ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఏదైనా సచివాలయాన్ని సందర్శించి కార్యక్రమాలు జరుగుతున్న తీరు, అందుకు ప్రజల నుంచి వస్తున్న ప్రతి స్పందనను స్వయంగా చూడాలని ప్రజలను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రజల ఇళ్లను నేరుగా సందర్శించి వారితో వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి అంటే ఏంటో చూడగలమని పేర్కొన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ కార్యకర్త నుంచి నాయకుల వరకు దీన్ని ఆస్వాదిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, మహిళా విభాగం జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, గోలి తిరుపతి రావు, నక్కల లీలా కుమారి, మీరావలి, బేతంశెట్టి హరిబాబు, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ రెడ్డి, తాళ్ళపాలెం శ్రీను, జమ్ము శ్రీకాంత్, వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు, సాదు విజయలక్ష్మి, గొల్లపోలు కృష్ణ, ఆవుల సురేంద్ర, చావల అంకమ్మ, గుర్రం వెంకయ్య, వాణి, మాధవి, బత్తుల ప్రమీల, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కేబీ శ్రీను, పి.మోహన్ రావు, సిహెచ్.హనుమంతరావు, ఖాన్, గపూర్, కఠారి సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి



స్పందన కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలు ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు మొక్కుబడిగా కాకుండా పారదర్శకంగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలుంటే అర్జీదారులకు కారణాలు వివరించాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి రోజు కొంత సమయం కేటాయించాలని సూచించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఉమాదేవి, గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

- పొదిలి మండలం కాటూరివారిపాలేనికి చెందిన శ్రీనివాసులు డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి గ్రామంలో విద్యుత్ స్తంభం వంగిపోయి తీగలు కిందకు వేలాడుతున్నాయని, దాని ద్వారా ప్రజలు భయాందోళన చెందుతున్నారని విద్యుత్ శాఖ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి ప్రజలకు ప్రమాదం రగకుండా చూడాలని కోరారు.
- పుల్లలచెరువు మండలం వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తనకు వైఎస్ఆర్ క్రాంతి పథం కింద రుణం మంజూరైందని అయితే బ్యాంకు మేనేజర్ నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. పరిశీలించి తన లోను డబ్బు ఇప్పించాలని కోరారు.
- త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామానికి చెందిన పెదవెంకయ్య తన భూమిని ఆన్‌లైన్ చేయడం లేదని ఎన్నిసార్లు తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించినా ఫలితం లేదని పరిశీలించి తన భూమిని ఆన్‌లైన్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

మార్కాపురం అభివృద్ధికి రూ.1600 కోట్లు మంజూరు

- గడప గడపలో ప్రతి ఒక్కరినీ కలుసుకోవడం ఆనందంగా ఉంది
- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా మార్కాపురం పట్టణ, నియోజకవర్గ అభివృద్ధికి రూ.1600 కోట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం 200 రోజులకు చేరిన సందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి ఘనంగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని నాలుగున్నరేళ్ల కాలంలో ఆనందంగా జీవిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నియోజకవర్గంలో 200వ రోజుల్లో 70 వేల కుటుంబాలను సందర్శించి 97 శాతం పూర్తి చేశారన్నారు. గడప గడపకు వెళ్లిన సందర్భంగా అవ్వా, తాతలు, అక్కా, చెల్లెమ్మలు, అన్నా దమ్ములు ఆనందంగా పలకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుల ఆధారంగా సంక్షేమ పథకాలను అందించడంతో వారి ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందని అన్నారు. ట్యాక్స్‌ల రూపంలో ప్రభుత్వానికి చెల్లించిన నగదును సంక్షేమ పథకాల రూపంలో తిరిగి పేద, మధ్య తరగతి ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

సంక్షేమ పథకాలకు కావాల్సిన అర్హతలున్న వారందరికీ డీబీటీ ద్వారా నగదును అందజేశారన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చంద్రబాబునాయుడు, లోకేష్‌లు తమ కుటుంబంపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమనీ, ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషీర్ అలీబేగ్, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ జీ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, బుస్సెట్టి నాగేశ్వరరావు, సిరాజ్, దొడ్డా భాగ్యలక్ష్మి, కొత్త కృష్ణ, దారివేముల హర్షిత, నాగ అరుణ, డీ ప్రసాద్, రంగలక్ష్మి, రోజ్‌లిడియా, షెక్షావలి, డాక్టర్ మగ్బుల్ బాషా, కరీంబాషా, గుంటక వనజాక్షి, చెన్నారెడ్డి, మయూరి ఖాశీం, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ టీ నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మీరావలి, తర్లుపాడు కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, పత్తి రవిచంద్ర, ఉత్తమ్‌కుమార్, రంగయ్య, కొండయ్య యాదవ్, చిన్న మధ్య తరహా పరిశ్రమల డైరెక్టర్ మేడా బద్రి, బూదాల సతీష్, ఉస్మాన్, టీ బాలుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బైక్ ర్యాలీ సందర్భంగా ఎమ్మెల్యే కేపీని గజమాలతో ఘనంగా సత్కరించారు.



పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



పోలీస్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర దిన వేడుకల ఏర్పాట్లు

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

ఒంగోలు టౌన్: 77వ స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించనున్న వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. పోలీసు కవాతు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ వేడుకల్లో ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. గ్రౌండ్ ఆవరణలో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఎస్పీ మలికా గర్గ్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించి బందోబస్తును పరిశీలించారు. పోలీసుల రిహార్సల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. రిహార్సల్‌లో భాగంగా నిర్వహించిన పోలీసు కవాతుకు ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కవాతు వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు శాఖలో ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి వివిధ పతకాలను ఏ విధంగా అందుకోవాలో డెమో నిర్వహించారు.

25 మంది పోలీసులకు పతకాలు

స్వాతంత్య్ర దిన వేడుకల్లో జిల్లాకు చెందిన పలువురు పోలీసులకు సేవా పతకం, ఉత్తమ సేవా పతకం, డిజీ కమెండేషన్ పతకాలను మంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారు. మొత్తం 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ పతకాలను అందుకోనున్నారు.



శకటాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

ముఖ్యమంత్రి చేతుల మీదుగా...

విజయవాడలో జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో సీఎం జగన్ చేతుల మీదుగా జిల్లాకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు ఇండియన్ పోలీస్ మెడల్ కింద పతకాలు అందుకోనున్నారు. మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, ఒంగోలు దిశ డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసులు పతకాలు అందుకోనున్నారు.



మువ్వన్నెల పతాకంతో విద్యార్థులు

ఫెన్సింగ్ పోటీల్లో ప్రకాశం సత్తా

సాక్షి, భీమవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అండర్–20 ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను పశ్చిమగోదావరి జిల్లా గెలుచుకుందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సత్యనారాయణరాజు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల విజేతలకు అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు చేతుల మీదుగా సోమవారం బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వివరాలు వెల్లడిస్తూ.. మూడు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఫాయిల్ బాలికల విభాగంలో ప్రకాశం జిల్లాకు చెందిన తనూజ, ఎప్పే బాలికల విభాగంలో పీకే నమ్రత ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలు సెప్టెంబర్‌లో గుజరాత్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర అసోసియేషన్ తరఫున పాల్గొంటారని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణ మోహన్ చెప్పారు.

థ్యాంక్యూ సీఎం సార్


విద్యార్థుల కోసం వస్తున్న ఆర్టీసీ బస్సు

పీసీపల్లి: మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి నుంచి పెదయిర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాదాపు 50 మంది విద్యార్థులు వెళ్లి విద్యనభ్యసించేవారు. పదేళ్ల క్రితం ఈ మార్గంలో సరైన రోడ్డు లేకపోయినా ఆర్టీసీ వారు అతి కష్టం మీద విద్యార్థుల కోసం బస్సు నడిపారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనుల పేరుతో ఆ బస్సును తొలగించారు. అప్పటి నుంచి విద్యార్థులు ఆటోలను ఆశ్రయించి బడికెళ్లేవారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్‌కు సమస్యను వివరించారు. సత్వరమే స్పందించిన ఎమ్మెల్యే.. ఆర్టీసీ డీఎంతో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


బడికెళ్లేందుకు సిద్ధమైన విద్యార్థులు

ఆటో ఢీకొని వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

కొత్తపట్నం: ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొత్తపట్నంలోని మార్కెట్ సెంటర్‌లో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..కొత్తపట్నం రెడ్డిపాలేనికి చెందిన కోడూరి వెంకటేశ్వర్లు(54) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లగా గుర్తు తెలియని ఆటో కొత్తపట్నం నుంచి ఈతముక్కల వెళ్లే సమయంలో వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడే కుప్పకూలిపోవడంతో తీవ్ర గాయాలు కావడంతో 108లో ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై బి.సాంబశివరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీరులకు వందనం

స్వేచ్ఛే మా నినాదం, దాస్యం.. ఇక సహించం అంటూ తెల్లదొరలపై తిరుగుబాటు జెండా ఎగరేసిన సమర యోధులు.. స్వాతంత్య్ర సంగ్రామంలో అశువులు బాసిన ధీరులకు పుట్టినిల్లు ప్రకాశం జిల్లా. బానిస సంకెళ్ల నుంచి భరతమాతకు విముక్తి కల్పించేందుకు ఉద్యమించిన వీరులెందరికో 'ప్రకాశం' పురిటిగడ్డ. సిపాయిల తిరుగుబాటుకు ముందే తెల్లదొరల తలలు తెగనరికిన చరిత్ర.. సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాలకు ఊపిరి పోసిన ఘనత ఈ నేలది. భరత భూమిపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించిన సమరయోధులకు 'సాక్షి'అక్షరాంజలి..

– సాక్షి నెట్‌వర్క్



సై..సైరా... నరసింహారెడ్డి



బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసి తొలి స్వాతంత్య్ర సమరయోధుడుగా చరిత్రకెక్కిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమకు గిద్దలూరు మండలం కొత్తకోటలోని ఫిరంగి నేటికీ నిదర్శనంగా నిలుస్తోంది. పూర్వ కర్నూలు జిల్లాలోని 29 మంది పాలెగాళ్లలో ఒకరైన జయరామిరెడ్డి 70 గ్రామాలను పాలించేవారు. గిద్దలూరు మండలంలోని కోవెలకుంట్ల, కంభం ప్రాంతాలు ఆయన ఏలుబడిలో ఉండేవి. బ్రిటిష్ పాలకులు రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టి నేరుగా తమకే శిస్తు కట్టాలని చెప్పడం, జయరామిరెడ్డి దత్త పుత్రుడిగా కాకాని నరసింహారెడ్డిని అంగీకరించకపోవడంతో పోరు మొదలైంది. సీమ ప్రజలు నరసింహారెడ్డికి శిస్తు చెల్లించడం మొదలుపెట్టారు. దీంతో నరసింహారెడ్డిపై బ్రిటిష్ ప్రభుత్వం విప్లవకారుడిగా ముద్ర వేసింది. శిస్తు వసూలు చేయాలని ఓ అధికారిని ఉయ్యాలవాడకు పంపింది. అనుచితంగా ప్రవర్తించిన ఆ అధికారిని నరసింహారెడ్డి మట్టుబెట్టారు. అనంతరం కొత్తకోట సమీపంలోని అడవుల్లో జయరామిరెడ్డి నిర్మించిన కోటకు చేరుకున్నారు. బ్రిటిష్ పాలకులు దోచుకున్న సంపదనను కొల్లగొట్టి సైన్యం కోసం, పేదల కోసం ఖర్చు చేసేవారు. 1846లో నారేటర్ అనే బ్రిటిషు సేనాని నరసింహారెడ్డిని పట్టుకునేందుకు సైన్యంతో కొత్తకోటకు వచ్చాడు. అయితే యుద్ధంలో ఓడిపోయి పారిపోయాడు. యుద్ధం చేసి నరసింహారెడ్డిని బంధించలేమని భావించిన బ్రిటిష్ పాలకులు.. ఆయన వంట మనిషిని ధనంతో లోబర్చుకున్నారు. వంట మనిషి ఇచ్చిన సమాచారంతో నరసింహారెడ్డిని పట్టుకుని 1847 ఫిబ్రవరి 22వ తేదీన కర్నూలు జిల్లా కోవెలకుంట్లలో గల జుర్రేటి ఒడ్డున రెండు వేల మంది ప్రజల సమక్షంలో ఉరి తీశారు. కొత్తకోట బురుజుపై ఉన్న 11 ఫిరంగులను బ్రిటిష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మిగిలిన ఒక్క ఫిరంగి, కోట బురుజు.. నరసింహారెడ్డి పాలనకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిపోయాయి.

గదర్ వీరుడు చెంచయ్య..



బ్రిటీష్ పాలకుల నిరంకుశత్వంపై కనిగిరి గదర్ వీరులు గర్జించారు. స్వదేశీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని కార్మికులకు అండగా నిలిచారు. స్వాతంత్ర పోరాటయోధుడు, గదర్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, విప్లవకారుడైన దరిశి చెంచయ్య 1890లో కనిగిరిలో సామాన్య ఆర్యవైశ్య కుటుంబంలో వెంకట సుబ్బయ్య, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. స్థానిక బోర్డు స్కూల్ వెనుక వీధిలో దరిశి చెంచయ్య కుటుంబం నివాసం ఉండేది. చిన్ననాటి నుంచే బ్రిటీష్ నిరంకుశపాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఒంగోలు వచ్చిన దరిశి చెంచయ్య.. 1905లో వందేమాతర ఉద్యమం, ఆ తర్వాత స్వదేశీ ఉద్యమాలకు ఆకర్షితుడయ్యారు. అమెరికా, కెనడా దేశాల్లోని సిక్కులను, వ్యవసాయ కార్మికులను సమీకరించి 1913లో గదర్ పార్టీని స్థాపించారు. గదర్ అనే పత్రికను కూడా ప్రచురించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో, ప్రజానాట్యమండలి, అభ్యుదయ రచయితల ఉద్యమంలో దరిశి చెంచయ్య చాలాకాలం పనిచేశారు.36 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎనిమిదేళ్లు జైల్లోనే గడిపారు. 1931లో భార్య అన్నపూర్ణమ్మ ఆకస్మికంగా మృతి చెందడంతో 1932లో సుభద్రమ్మను వర్ణాంతర వివాహం చేసుకున్నారు. 1931–32లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం, దేవాలయ ప్రవేశ ఉద్యమంలో పాల్గొన్నారు. గాంధీజీ యరవాడ జైలులో హరిజనుల కోసం ఆమరణ నిరాహార దీక్ష సాగించినప్పుడు చెంచయ్య, సుభద్రమ్మ దంపతులు మద్రాసులో హరిజనులతో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. సాంఘిక దురాచాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. దీంతో చెంచయ్య తన సామాజికవర్గం నుంచి వెలివేయబడ్డారు. పరిపూర్ణ అనే గిరిజన బాలికను పెంచుకున్నారు. స్త్రీ విద్య, హరిజనోద్యమం, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా చెంచయ్య అనేక పోరాటాలు చేశారు.

ఆదర్శం.. దేవరంపాడు ఉప్పు సత్యాగ్రహం



ఆంగ్ల ప్రభుత్వం ఉప్పుపై విపరీతమైన పన్ను భారాన్ని మోపడంతోపాటు ఉప్పు మడుల్లోకి అనుమతిలేనిదే ప్రవేశించరాదని ఆంక్షలు విధించింది. దీంతో ఉప్పు చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 1930 మార్చి 12న గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుంచి దండి వరకు గాంధీ పాదయాత్ర నిర్వహించారు. ఈ స్ఫూర్తితో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అమ్మనబ్రోలు, కనపర్తి, వాడరేవు తదితర ప్రాంతాల్లో ఉప్పు సత్యాగ్రహం తీవ్రస్థాయిలో జరిగింది. కరవది మహిళలు మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటారు. టంగుటూరి ప్రకాశం మద్రాసులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించారు. కనపర్తిలో నాణ్యమైన ఉప్పు పండించడంతోపాటు అక్కడ ప్రభుత్వ గోదాములు ఉండటంతో సత్యాగ్రహులు వాటిపై దాడి చేయడం ప్రారంభించారు. అక్కడికి సమీపంలోని దేవరంపాడులో ప్రకాశం పంతులుకు చెందిన భవనాన్ని వారు శిబిరంగా ఉపయోగించుకున్నారు. లార్డ్ ఇర్విన్, మహాత్మాగాంధీ ఒప్పందం వల్ల ఉప్పు సత్యాగ్రహం ఆగింది. సత్యాగ్రహం విజయవంతమైనందుకు గుర్తుగా దేవరంపాడులో విజయస్థూపాన్ని 1935 నవంబరు 21న అప్పటి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ప్రకాశం పంతులు తన భవనాన్ని, పొలాన్ని ట్రస్టుకు రాసిచ్చారు. విజయ స్థూపంపై మహాత్మా గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆస్తులన్నీ.. సంగ్రామానికే..


కైపు వీరారెడ్డి నివాసం

తెల్లదొరల దాస్య శృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కల్పించే పోరాటంలో త్యాగాలు చేసిన వారిలో కైపు వీరారెడ్డి ఒకరు. భూస్వామ్య కుటుంబానికి చెందిన ఈయన అయిన వారిని వదిలేసి, యావదాస్తిని ఉద్యమం కోసం ఖర్చు చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా, పొదిలి తాలూకా మునగపాడు గ్రామంలో 1909 జనవరి 7వ తేదీన కైపు వెంకటపతిరెడ్డి, కోటమ్మ దంపతులకు వీరారెడ్డి జన్మించారు. స్వాతంత్య్ర ఉద్యమం వైపు ఆకర్షితులు కావడంతో ఉన్నత చదువులకు వీరారెడ్డి దూరమయ్యారు. తండ్రితో కలిసి చుట్టు పక్కల గ్రామాలకు గుర్రంపై వెళ్లి పంచాయతీలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడంతో 1941 జనవరిలో అరెస్ట్ అయ్యారు. పొదిలి, కందుకూరు, నెల్లూరు, బళ్లారి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవించారు. జైలు నుంచి మూడు నెలల తర్వాత విడుదలైన వీరారెడ్డి ఊరూరా గ్రామసభలు నిర్వహించి హరికథలు, బుర్రకథల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి స్వాతంత్య్ర పోరాటంలో భాగస్వాములను చేశారు.

'ఓరుగంటి' తిరుగుబావుటా..



స్వాతంత్య్ర ఉద్యమంలో పశ్చిమ ప్రకాశానికి ఒక పేజీ ఉంది. మహనీయుల బాటలో నడిచిన వారిలో ఓరుగంటి వెంకట రమణయ్య ఒకరు. మాటల్లో మృదుత్వం, కళ్లలో కార్యదీక్ష, కలంలో నిజాయితీ ఉట్టిపడే వ్యక్తి మార్కాపురం ప్రాంత మొదటి జర్నలిస్టు ఓరుగంటి వెంకట రమణయ్య. స్వాతంత్ర్యోద్యమంలో తన వంతు కర్తవ్యం నిర్వహించారు. 1917జూలై 1న మార్కాపురం పట్టణంలో జన్మించిన రమణయ్య 1932లో గాంధీజీ పిలుపు మేరకు విదేశీ వస్తు బహిష్కరణ, పికెటింగ్, సత్యాగ్రహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వరాజ్య సముపార్జనలో భాగంగా రాజకీయ పాఠశాలలో పాల్గొని అయ్యదేవర కాలేశ్వర రావు, కొండా వెంకటప్పయ్య పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. స్వాతంత్య్ర సమరం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న రోజుల్లో ఆయన పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఇదే సమయంలో పలు పత్రికలకు రచనలు చేశారు. పత్రికలపై బ్రిటీష్ ప్రభుత్వం నిషేధం విధించిన సందర్భంలో పత్రిక ప్రతులను ఆయన ధైర్యంగా పశ్చిమ ప్రకాశం ప్రజలకు అందించి స్వాతంత్ర్యోద్యమ విశేషాలను వివరించారు. తన చివరి రోజు వరకు ఖద్దరు దుస్తులే ధరించారు.

ప్రతిపక్షాల మైండ్‌గేమ్‌కు

ప్రజలే చరమగీతం పాడతారు

- టిడ్కో ఇళ్ల నిర్మాణంలో టీడీపీ చేసిన అన్యాయాన్ని ప్రజలు ప్రశ్నించాలి
- పేదలకు పట్టాలు ఇస్తుంటే కోర్టుకు వెళ్లి ఆపించడం ఏపాటి న్యాయం
- 508 ఎకరాల భూసేకరణలో పైసా కూడా అవినీతికి తావులేకుండా చర్యలు
- చేసిన అభివృద్ధి, కొనసాగుతున్న సంక్షేమమే అజెండాగా ఎన్నికలకు
- డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: తాను పార్టీ మారుతున్నానంటూ ప్రతిపక్షాలు చేస్తున్న మైండ్‌గేమ్‌కు ప్రజలే చరమగీతం పాడుతారని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేబుల్ టీవీ నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి అప్పటికప్పుడే పరిష్కరించేందుకు తగు సూచనలు చేశారు. ఎటువంటి సమస్య ఉన్నా ప్రజలు నేరుగా తనను కలవవొచ్చని, లేదా డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో సమస్యను తెలియజేయవచ్చన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణంలో టీడీపీ చేసిన అన్యాయాన్ని ప్రశ్నించాలి:

టిడ్కో ఇళ్లకు సంబంధించి 14 వేలమందికిపైగా ప్రజల వద్ద నుంచి అప్పటి ప్రభుత్వం డబ్బులు వసూలు చేసింది. కానీ వాస్తవానికి కడుతున్న ఇళ్లు కేవలం 4128 మాత్రమే. మరి అంతమంది వద్ద డబ్బులు వసూలుచేసి ఇళ్లు మిగిలిన దాదాపు పది వేల మందికి ఎలా ఇవ్వాలి. అది సాధ్యపడదు కనుకనే గతంలో అధికంగా ఇచ్చిన పేర్లు రద్దుచేశారు. ఈ విషయంపై ప్రజలు టీడీపీ నాయకులను నిలదీయాలి. ఇళ్లు కట్టకుండా తమ వద్ద డబ్బులు ఎందుకు తీసుకున్నారంటూ ప్రశ్నించాలి. అసలు ఇంటి నిర్మాణం కూడా లేకుండా , ఎక్కడ స్థలంలో కడతారో కూడా చెప్పకుండా ఉన్న 4 వేల ఇళ్లనే 14 వేలమందికి ఇస్తామని చెప్పడం న్యాయమా అంటూ ప్రశ్నించారు.

పూర్తి పారదర్శకంగా ఇంటి పట్టాలు:

పేదలకు ఇంటి పట్టాలు ఇస్తుంటే దానిపైన కోర్టుకెక్కారు. ఇదెక్కడి న్యాయం. పేదవానికి కాస్తంత జాగా కల్పించినా తట్టుకోలేని రాజకీయం అవసరమా అని ఆవేదన వ్యక్తం చేశారు. యరజర్ల వద్ద పాతికవేల మందికి ఒకే ప్రదేశంలో పట్టాలు ఇప్పించడం ద్వారా ఒక టౌన్‌షిప్‌ను నిర్మించాలనుకున్నామన్నారు. అయినా దేవుని దయ, ఆశీర్వాదం ఉంటే ఏదైనా సాధ్యమే అని, అందులో భాగంగానే సీఎం దృష్టికి సమస్యను తీసుకువెళితే ఆయన భూమి కొనుగోలు చేయమన్నారని చెప్పారు. ఇందుకు 508 ఎకరాలను రూ.200 కోట్లు వెచ్చించి కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొంతమందికి డబ్బు జమ చేశారని, మరో పదిరోజుల్లో మిగిలిన వారికి జమ అవుతుందన్నారు. గతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్థల సేకరణలో కొంతమంది పేదలకు ఇచ్చే పట్టాలకు డబ్బు తీసుకున్నారని, కానీ తాము సేకరించిన 508 ఎకరాల్లో ఒక్క పైసా కూడా అవినీతికి తావులేకుండా చర్యలు చేపట్టారన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికలకు:

చేస్తున్న అభివృద్ధి, కొనసాగుతున్న సంక్షేమమే లక్ష్యంగా 2024 ఎన్నికలకు వెళతామని బాలినేని స్పష్టం చేశారు. పాతిక వేల మందికి ఇళ్లపట్టాల పంపిణీ, రూ.339 కోట్లతో తాగునీటి పథకాన్ని ప్రారంభించుకుని ఎన్నికలకు వెళతామన్నారు. ఇన్నిసార్లు నన్ను ప్రజలు గెలిపించారంటే వారి హృదయాలలో తాను ఉండడం కాదని, వారంతా తన హృదయంలో ఉన్నారన్నారు. అందుకే ప్రతి క్షణం ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటూ వస్తున్నానని, అది తన ధర్మంగా భావిస్తానన్నారు.

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా రుణాలు

- పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి


రుణాల కరపత్రాన్ని విడుదల చేస్తున్న పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి

కనిగిరి రూరల్: కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా రుణాలిస్తామని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) అన్నారు. స్థానిక పీడీసీసీ బ్యాంకు ఆవరణలో బ్యాంకు సీఈఓ వై ప్రకాష్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సహకార బ్యాంకుల్లో విదేశీ విద్య రుణాలు, కారు, గృహ రుణాలు, క్రాప్, ఎల్‌టీ లోన్స్‌ను అందచేసేందుకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని సొసైటీలకు సొంత నూతన భవనాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఏటీఎం కార్డుల ద్వారా రైతులు డబ్బులు తీసుకునేలా మొబైల్ ఏటీఎం వాహనం ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. రైతులకు అందుబాటులో ఉండి ఎల్లప్పుడు సేవలు అందిస్తానని చెప్పారు. సహకార బ్యాంకుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతుల శ్రేయస్సే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ప్రభుత్వ పథకాలను, రాయితీలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ కృష్టారెడ్డి, సూపర్‌వైజర్ అట్లా శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు సంగుసు బ్బారెడ్డి, కాకర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సర్పంచ్‌లు దామిరెడ్డి నాగేంద్రారెడ్డి, నారాయణ రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, బ్యాంకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. తొలుత పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా బ్యాంకు రుణాల బ్రోచర్‌ను విడుదల చేశారు.

కొడుకుని కడతేర్చిన తండ్రి

- మద్యానికి బానిసై డబ్బుల కోసం తండ్రిని హింసిస్తున్న కొడుకు
- కుమారుడి వేధింపులు భరించలేక గొడ్డలితో నరికి చంపిన తండ్రి


మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్‌ఐ


హత్యకు గురైన సుబ్బారావు

ముండ్లమూరు: మద్యానికి బానిసై డబ్బుల కోసం హింసిస్తున్న కొడుకుని వేధింపులు భరించలేక ఓ తండ్రి గొడ్డలితో నరికి చంపాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం పోలవరంలో సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు పోలవరం గ్రామానికి చెందిన కుంచాల సుబ్బారావు (36) మద్యానికి బానిసై పనీపాట లేకుండా జులాయిగా తిరుగుతూ దొరికినకాడికి అప్పులు చేశాడు. మద్యానికి బానిసైన సుబ్బారావుపై అద్దంకి, ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు నమోదయ్యాయి. మద్యానికి డబ్బులు కావాలని తరచూ తండ్రిని వేధిస్తుండేవాడు. తన దగ్గర లేవని చెప్తే ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని కొట్టి, బెదిరించే వాడు. అప్పులు తీర్చేందుకు డబ్బులు కావాలని తరచూ తండ్రితో గొడవపడతుండే వాడు. చేసిన అప్పులు తీర్చేందుకు ఆదివారం ఇంటి స్థలాన్ని కుదువ పెట్టే ప్రయత్నం చేస్తుండగా తండ్రి మందలించాడు. కుదువ పెట్టే క్రమంలో ఇంటి స్థలాన్ని కొలత కొలుస్తుండగా తండ్రి వెంకటేశ్వర్లు అడ్డుకునే ప్రయత్నం చేయగా అడ్డుపడితే చంపుతానని బెదిరించాడు. పిల్లలకు ఆధారంగా ఉన్న ఇంటి స్థలాన్ని కూడా అమ్మితే పిల్లలు వీధిన పడతారని నచ్చ చెప్పినా వినలేదు. గ్రామంలో కొలుపుల సందర్భంగా సోమవారం కూడా అదే తరహాలో రోజూ లాగే మద్యం తాగి ఇంటికి వచ్చిన సుబ్బారావు తండ్రితో గొడవపడి బెదిరించాడు. అతని వేధింపులు భరించలేక విసిగిపోయిన తండ్రి వెంకటేశ్వర్లు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. కొద్దిసేపటికి మద్యం మత్తులో సుబ్బారావు నిద్రపోయాడు. ఇదే అదనుగా భావించిన తండ్రి వెంకటేశ్వర్లు ఒక్కసారిగా గొడ్డలితో సుబ్బారావుపై దాడి చేశాడు. ఈ దాడిలో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, పదో తరగతి చదువుతున్న కుమారి, ఎనిమిదో తరగతి చదువుతున్న నిహారిక ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారావుకి 13 ఏళ్ల క్రితం పల్నాడు జిల్లా నూజెళ్ల మండలం రెడ్డిపాలెంకు చెందిన వెంకటలక్ష్మితో వివాహమైంది. మొదటి నుంచి సుబ్బారావు అల్లరి చిల్లరిగా తిరుతూ ఏదో ఒక గొడవలకు పోతుండేవాడు. గ్రామంలో హత్య సమాచారం తెలుసుకున్న దర్శి సీఐ రామకోటయ్య, ఎస్ఐ యూవీ కృష్ణయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హైకోర్టులో ఉద్యోగం పేరుతో మోసం

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి గుంటూరుకు చెందిన దుర్గా కన్సల్టెన్సీ నిర్వాహకులు తన వద్ద నుంచి రూ.3 లక్షలు తీసుకొని మోసం చేశారని కనిగిరి పట్టణానికి చెందిన ఏ.బాలాజీ ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ మలికాగర్గ్‌ను కలిసి తనకు ఫేక్ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి మోసం చేశారని వాపోయారు. అలాగే పల్నాడు జిల్లాకు చెందిన ఒక రైతు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. తాను పండించిన మిర్చి పంటను రూ.20 లక్షలకు కొనుగోలు చేసిన ఒంగోలు చెందిన పి.లక్ష్మీనారాయణ కేవలం రూ.13 లక్షలు మాత్రమే ఇచ్చాడని, మిగతా డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు అడుగుతుంటే బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. స్పందనకు మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి బాధితులకు న్యాయం చేకూర్చాల్సిందిగా ఆదేశించారు. స్పందన ఫిర్యాదులకు అధికా ప్రాధన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై శ్రద్ధ చూపాలని సూచించారు. ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పామూరు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన పామూరు మండలంలోని బోడవాడ చెరువు సమీపంలోని పొలాల్లో సోమవారం సాయంత్రం వెలుగుచూసింది. వివరాలు.. గ్రామానికి చెందిన వారు పొలాల్లో సంచరిస్తుండగా వారికి గుర్తుతెలియని సుమారు 55 ఏళ్ల వయస్సున్న వ్యక్తి మృతేదేహాన్ని గమనించారు. వెంటనే ఎస్సై కె.సురేష్‌యాదవ్‌కు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వీఆర్‌వో శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి వైద్యశాలకు తరలించారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?

నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగురవేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.



స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాధలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్ర్యం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది.

ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్ర్యం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యతగల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్ర్య భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండి పోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్ర్య దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్ర్య సమర యోధుల విజయగాధలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు


సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను/1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాజీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్.. పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

సాగుబడి

అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చి గడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చి గడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17,500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).